## 23 నుండి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి

వివరాలు 2లో...



17వ వసంతంలోకి...
నేటి దినపత్రిక
# సూర్య
ఎన్టీఆర్ - కృష్ణా

బుధవారం 22 నవంబర్ 2023 పేజీలు 8

### మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచాలన్నదే..

# ప్రభుత్వ లక్ష్యం

- జిల్లాలో మత్స్యకారులకు రాయితీపై రూ. 3 కోట్లతో ఆక్వా హబ్‌లు, ఫిష్ వెండింగ్ యూనిట్లు మంజూరు
- త్వరలో కృష్ణానదిలో 25 లక్షల చేపపిల్లల విడుదల
- జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు

వివరాలు 2లో






## పోస్టాఫీస్ పథకాలు సద్వినియోగం చేసుకోండి

వివరాలు 2లో

సాగర్ జలాలు తీసుకురావడంలో

## ఎమ్మెల్యే వసంత విఫలం

పంటలు ఎండిపోయి రైతాంగం తీవ్ర నష్టానికి గురైంది

మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

వివరాలు 2లో






మాతా, శిశు మరణాల పూర్తిస్థాయి నియంత్రణపై

# దృష్టిపెట్టండి



- గత మరణాల సమగ్ర విశ్లేషణతో ప్రణాళికలు రూపొందించి, అమలుచేయండి
- వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో కలెక్టర్ ఎస్.డిల్లీరావు

ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ : జిల్లాలో మాతా, శిశు మరణాలు సంభవించకుండా కృషిచేయాలని.. గత మరణాలను సమగ్రంగా విశ్లేషించి పూర్తిస్థాయిలో మరణాల నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికను అమలుచేయాలని మిగతా 2లో

(మొదటిపేజీ తరువాయి)

## 23 నుండి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం



**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ నవంబర్ 23 నుండి ప్రారంభం కానుందని కమిషనర్, ఎక్స్ అఫీషియో సెక్రటరీ, సమాచార, పౌర సంబంధాల శాఖ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తూ అక్రిడిటేషన్ కలిగిన అర్హులైన జర్నలిస్టులకు హౌసింగ్ స్కీమ్ క్రింద ఇంటి స్థలాలను అందించేందుకు ప్రభుత్వం జీవో నెంబర్ 535 ద్వారా వీలు కల్పించిందన్నారు. అర్హులైన జర్నలిస్టులు ఇళ్ల స్థలాల మంజూరు కోసం తమ వివరాలను http://ipr.ap.gov.in వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్ లో నమోదు చేసుకోవాలన్నారు. నవంబర్ 23వ తేదీ నుండి ఈ వెబ్ సైట్ అందుబాటులో ఉంటుందని, 45 రోజుల్లోగా (2024 జనవరి 6వ తేదీ) పైన తెలియజేసిన వెబ్‌సైట్ లో జర్నలిస్టులు సంబంధిత వివరాల తో ఆన్‌లైన్ లో తమ దరఖాస్తును సమర్పించాలన్నారు. అక్రిడిటేటెడ్ జర్నలి స్టులకు కేటాయిస్తున్న ఇళ్ల స్థలం విలువలో 60 శాతం ప్రభుత్వం, 40 శాతం జర్నలిస్టులు చెల్లించాలని ఆయన తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత జర్నలిస్ట్ అక్రిడిటేషన్ వివరాలను, జర్నలిస్ట్‌గా వారి వృత్తి అనుభవాన్ని ప్రాథమికంగా పరిశీలించి, అర్హులైన జర్నలిస్టుల జాబితాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్లకు అందజేస్తామని ఆయన తెలిపారు. తదనంతరం జిల్లా కమిటీలు నిబంధనల మేరకు జర్నలిస్టుల అర్హతను పరిశీలించి ఇళ్ల స్థలాలను కేటాయించడానికి సరైన స్థలాలను జిల్లా పరిధిలోనే గుర్తిస్తారని తెలిపారు. ఇప్పటికే తాము సరైన స్థలాలను గుర్తించే విధంగా జిల్లా స్థాయి కమిటీలను వారం రోజుల్లోగా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్లకు లేఖలు రాశామని ఆయన తెలిపారు. అర్హులైన అక్రిడిటేటెడ్ జర్నలిస్టులందరూ నిర్ణీ త సమయంలో ఆన్‌లైన్ లో తమ దరఖాస్తులను నమోదు చేసుకోవాలని, ప్రభుత్వం జర్నలిస్టుల సేవలను గుర్తించి ఇస్తున్న ఈ సదవకాశాన్ని వినియో గించుకోవాలని తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి ఆ ప్రకటనలో తెలియజేశారు.

## సాగర్ జలాలు తీసుకురావడంలో ఎమ్మెల్యే వసంత విఫలం

**పంటలు ఎండిపోయి రైతాంగం తీవ్ర నష్టానికి గురైంది**

**మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు**



**రెడ్డిగూడెం, మేజర్‌న్యూస్ :** సాగర్ జలాలు సకాలంలో తీసుకొచ్చి రైతులను ఆదుకోవడంలో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ విఫలమయ్యారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. రెడ్డిగూడెం మండల టీడీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో సమావేశంలో మాట్లాడుతూ నవంబర్ 15వ తేదీ నాటికి సాగర్ జలాలు రావాల్సి ఉండగా ఎమ్మెల్యే నిర్లక్ష్య వైఖరి వల్ల నేటికి కూడా సాగర్ జలాలు రాలేదని, దీంతో పంటలు ఎండిపోయి రైతాంగం తీవ్ర నష్టానికి గురైందన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూడా ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఎమ్మెల్యే వసంత నిర్లక్ష్య వైఖరి వల్లే చింతలపూడి ఎత్తిపోతల పథకం నేటి వరకు పూర్తి కాలేదని ఆయన విమర్శించారు. రైతు భరోసా ద్వారా రైతులకు అందాల్సిన డబ్బులు ప్రభుత్వం నుంచి ఇప్పటికి అందలేదని, కానీ భరోసా కేంద్రాలు ప్రారంభించడం విడ్డూరంగా ఉందన్నారు. భవిష్యత్తు గ్యారెంటి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టోపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎటువంటి అధారాలు కూడా లేని స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబుకు బెయిల్ లభిస్తే ప్రభుత్వ సలహదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఏడుస్తుండటం హాస్యస్పదంగా ఉందన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబుకు పూర్తి స్థాయిలో బెయిల్ రావడంతో చంద్రబాబు చిత్ర పటానికి స్థానిక నాయకులతో కలసి ఉమా పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి, జనసేన నాయకులు సుందరరామిరెడ్డి, ఉయ్యూరు అంజిరెడ్డి, జాలనపాటి వేణుగోపాలరెడ్డి, బెల్లంకొండ రాజా, రాయుడి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

**జిల్లాలో మత్స్యకారులకు రాయితీపై రూ. 3 కోట్లతో ఆక్వా హబ్‌లు, ఫిష్ వెండింగ్ యూనిట్లు మంజూరు**

**త్వరలో కృష్ణానదిలో 25 లక్షల చేపపిల్లల విడుదల**

**జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు**




**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** మత్స్యకారుకు ఆర్థిక సహాయం అందించి వారి జీవన ప్రమాణాలను పెంచాలనే లక్ష్యంతో రాయితీపై ఆక్వా హబ్‌లు, ఫిష్ వెండింగ్ యూనిట్లు, సంచార విక్రయ వాహనాలు మంజూరుచేయడం జరిగిందని.. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహకారాన్ని అందిపుచ్చుకొని ఆర్థిక పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు మత్స్యకారులకు సూచించారు. ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా మంగళవారం నగరంలోని కలెక్టరేట్‌లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డిల్లీరావు పాల్గొని.. శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జీవితాలను పణంగా పెట్టి రేయింబవళ్లు నదులు, సముద్రాలపై జీవనయానం సాగిస్తున్న మత్స్యకారులు, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మత్స్యకారుల జీవన ప్రమాణాలను పెంచేందుకు వైఎస్ఆర్ మత్స్యకార భరోసా, ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల ఏర్పాటు, డీజిల్‌పై సబ్సిడీ, ఎక్స్‌గ్రేషియా వంటి పథకాలను అమలుచేస్తున్నట్లు తెలిపారు. మర, యాంత్రిక పడవలతో పాటు సంప్రదాయ పడవలపై వేటకు వెళ్లే మత్స్యకార కుటుంబా లకు లబ్ధికల్పిస్తోందన్నారు. మత్స్యకారులకు మేలు జరిగేలా స్మార్ట్ కార్డులను జారీచేయడంతో పాటు డీజిల్‌పై లీటరుపై రూ. 9 సబ్సిడీ అందించి.. మత్స్యకారులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఫిష్ ఆంధ్రా పథకం ద్వారా నాణ్యమైన చేపలు, రొయ్యలు వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు స్వయంగా మత్స్యకారులే ఆక్వా హబ్‌లు, ఫిష్ వాల్యూ యాడెడ్ యూనిట్లు, లైవ్ ఫిష్ వెండింగ్ సెంటర్లు, ఫిష్ కియోస్కులు, ఐస్ బాక్సులతో కూడిన ద్వి, త్రిచక్ర మోటారు వాహనాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మినీ ఫిషింగ్ వెండింగ్ యూనిట్లు, సీడ్ స్టాకింగ్ రిజర్వాయర్లు ఏర్పాటుచేసుకునేలా సబ్సిడీపై రుణాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు రూ. 3 కోట్ల విలువైన వివిధ యూనిట్ల ఏర్పాటుకు రుణాలు అందించామన్నారు. మత్స్య కారులు బహిరంగ మార్కెట్లో మొబైల్ వాహనాల ద్వారా తాజా మత్స్య సంపదను వినియోగదారులకు నేరుగా విక్రయించుకుని ఆర్థిక పరిపుష్టిని సాధించాలని లక్ష్యంతో సబ్సిడీపై మొబైల్ వాహనాలను మంజూరు చేసినట్లు తెలిపారు. కృష్ణానది, సముద్రంలో వేటాడిన మత్స్య సంపదతో పాటు చెరువుల ద్వారా ఉత్పత్తి చేసిన మత్స్య సంపదను విక్రయించుకోవడంతో పాటు చేపలు, రొయ్యలు, పీతలు వంటి జల సంపదతో తయారు అయిన రెడీ టూ ఈట్ ఉత్పత్తులను మొబైల్ వాహనాల ద్వారా రిటైల్ గా విక్రయించుకునే అవకాశం మత్స్యకారులకు మత్స్యకార సంఘాలకు కల్పించినట్లు ఆయన తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా జిల్లాలోని కృష్ణానది పరివాహక ప్రాంతంలో మత్స్యకారులకు మత్స్యసంపదను కల్పించాలనే లక్ష్యంతో 25 లక్షల చేప పిల్లలను త్వరలో విడుదల చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఆర్థిక భరోసాను మత్స్యకారులు అందిపుచ్చుకొని జీవన ప్రమాణాలు మెరుగుపరచుకోవాలని జిల్లా కలెక్టర్ డిల్లీరావు కోరుతూ మత్స్యకారులకు ప్రపంచ మత్స్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి ఎ.నాగరాజ, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, డెవలప్‌మెంట్ అధికారులు బి. శ్యామ్ లెనిన్‌బాబు, పి.అఖిల, నాగభద్రరావు, మత్స్యకార సంఘాల ప్రతినిధులు లంకే గోవిందరాజులు, నడకుదిటి కాళీ, జిల్లాకు చెందిన మత్స్యకారులు పాల్గొన్నారు.

# పోస్టాఫీస్ పథకాలు సద్వినియోగం చేసుకోండి

**ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి యోజన : కలెక్టర్ పి.రాజాబాబు**

మచిలీపట్నం, మేజర్‌న్యూస్ : కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ (డిపార్ట్మెంట్ ఆఫ్ పోస్ట్స్) ద్వారా నిరుపేదల, ఆడపిల్లల సామాజిక భద్రతకై అమలు చేస్తున్న పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. అతి తక్కువ ప్రీమియంతో పెద్ద మొత్తంలో ఆర్థిక ప్రయోజనంతో జిల్లాలోని వివిధ తపాలా కార్యాలయాలలో ఈ పథకాలు లభ్యమవుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయినపుడు బాధితుల కుటుంబాలు రోడ్డున పడకుండా వారిని ఆదుకునేందుకు గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ (జిఎజి) పాలసీని తపాలా శాఖ ప్రవేశపెట్టిందని అన్నారు. ఈ పథకం కింద ఏడాదికి ఒక్కో వ్యక్తి కేవలం 400 రూపాయల ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని, ప్రమాదవశాత్తు మరణించినా లేదా శాశ్వత అంగవైకల్యం కలిగినా 10 లక్షల రూపాయల భీమా కవరేజ్ లభిస్తుందన్నారు. 18 నుండి 65 సంవత్సరాల మధ్య వయసు గలవారు ఈ పథకంలో చేరవచ్చునని కలెక్టర్ వివరించారు. సుకన్య సమృద్ధి యోజన పథకం క్రింద 0-10 సం లోపు ఆడపిల్లల పేరున వారి తల్లిదండ్రులు గాని చట్టపరమైన సంరక్షకులు గాని కేవలం రు.100 రూపాయల నెలవారి డిపాజిట్ తో ఈ పథకంలో చేరవచ్చునని, ఆడపిల్లకు 21 సంవత్సరాలు నిండిన తరువాత 53,945 రూపాయల ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఈ సేవలు జిల్లాలోని అన్ని తపాలా కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ పథకాల గురించి ఇతర వివరాలకు ప్రజలు వారి దగ్గరలోని తపాలా కార్యాలయాల్లో సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

# మాతా, శిశు మరణాల పూర్తిస్థాయి నియంత్రణపై దృష్టిపెట్టండి

(మొదటిపేజీ తరువాయి)

కలెక్టర్ ఎస్.డిల్లీరావు.. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ డిల్లీరావు.. వైద్య, ఆరోగ్యశాఖ జిల్లాస్థాయి అధికారులతో కలిసి జిల్లాలో చోటుచేసుకున్న మాతా, శిశుమరణాలపై సమీక్ష నిర్వహించారు. సెప్టెంబర్, అక్టోబర్‌లో చోటుచేసుకున్న రెండు మాతృ మరణాలతో పాటు జులై, ఆగస్టు, సెప్టెంబర్‌లో సంభవించిన నాలుగు శిశు మరణాలకు సంబంధించిన నివేదికలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు నమోదైన మాతా, శిశు మరణాలకు కారణాలను విశ్లేషించి, ఇలాంటి మరణాలు చోటుచేసుకోకుండా భవిష్యత్తు కార్యాచరణను సిద్ధం చేసి, అమలుచేయాలన్నారు. ప్రతి మరణంపైనా సంస్థాగత, డీఎంహెచ్‌వో, జిల్లాస్థాయిలో సమగ్ర విశ్లేషణ, తద్వారా రూపొందించిన ప్రణాళికలతో మరణాలను శతశాతం నివారించేందుకు వీలవుతుందన్నారు. మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి అవసరమైన అన్ని వైద్య పరీక్షలు చేయించుకునేలా గ్రామ స్థాయిలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలని సూచించారు. వీరు తరచు గర్భిణీల ఇళ్లను సందర్శించి రక్తహీనత సమస్య ఏర్పడకుండా పౌష్టికాహారం తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. మాతా, శిశు సంరక్షణకు ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకునేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంలో నిర్లక్ష్యం చూపకుండా చూడాలన్నారు. రిజిస్ట్రేషన్ దగ్గరి నుంచి గర్భిణీల ఆరోగ్యం వివరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని, ముప్పు అధికంగా (హైరిస్క్) ఉన్నవారి పట్ల వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంత పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బందికి ఎప్పటికప్పుడు ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహించాలన్నారు. మాతా, శిశు మరణాల నియంత్రణకు ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాలు, విధానాల అమల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహించినట్లు తేలితే చర్యలు తప్పవని కలెక్టర్ డిల్లీరావు స్పష్టం చేశారు.

**నిమోనియాపై విస్తృత అవగాహన కల్పించాలి: కలెక్టర్ డిల్లీరావు**

ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలకు ఒక ముఖ్య కారణంగా ఉన్న నిమోనియాపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ డిల్లీరావు అధికారులను ఆదేశించారు. ఆయన కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి నిమోనియాపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిమోనియా లక్షణాలు, నిమోనియా నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అదే విధంగా ఇన్‌పేషెంట్, అవుట్‌పేషెంట్ నిమోనియా కేసుల నిర్వహణపై వైద్య, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించాలని కలెక్టర్ డిల్లీరావు సూచించారు.

కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, డీసీహెచ్ఎస్ డా. బీసీకే నాయక్, డీఐవో డా. అమృత, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. ఇందుమతి, సీనియర్ గైనకాలజిస్ట్ డా. ప్రభావతి, జీజీహెచ్ వైద్యాధికారులు తదితరులు హాజరయ్యారు.

# మీరు ఎక్కడ ఉంటే అక్కడే ఓటు వెయ్యండి





## వోటర్ వెరిఫికేషన్ ప్రకియలో బి.ఎల్.ఓ.కు సహకరించండి

### నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ప్రజలు ఎక్కడ నివాసం ఉంటున్నారో అక్కడే ఓటు వేయమని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం పరిధిలో ఉన్న తోట వారి వీధి, నందమూరి నగర్, వాంబే కాలనీ లో మంగళవారం ఉదయం క్షేత్రస్థాయిలో ఓటర్ల వెరిఫికేషన్ను స్వయంగా విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తనఖీ చేశారు సెంట్రల్ నియోజకవర్గం పొలిటికల్ పార్టీలు, లోవర్ లెవెల్ స్టాఫ్ నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత రెండు మూడు సంవత్సరాలుగా ఆ ప్రాంతాలు కొత్తగా అభివృద్ధి చెందడం వలన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలందరూ అక్కడ దగ్గరలో ఉన్న పోలింగ్ స్టేషన్లో వాళ్ల పేర్లను మార్చుకోవాల్సిందిగా కోరారు. వాంబే కాలనీ ఎక్సెల్ ప్లాంట్ వెనుక ఉన్న జేఎన్యుఆర్ఎం అపార్ట్మెంట్స్ లో ఉంటున్న ప్రజలకు, వివిధ పోలింగ్ స్టేషన్లో వాళ్ల ఓట్లను కేటాయించారు అని పొలిటికల్ పార్టీలు కమిషనర్ కు ఫిర్యాదు చేయగా, కమిషనర్ ఫీల్డ్ వెరిఫికేషన్ లో పరిశీలించి అక్కడ వివిధ పోలింగ్ స్టేషన్లో ఉన్న ఓట్లను దగ్గర్లో ఉన్న పోలింగ్ స్టేషన్లోకి మార్చవలసిందిగా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మరో రెండు రోజులపాటు ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతుందని, 20 సీనియర్ లెవెల్ ఆఫీసర్స్ పర్యవేక్షిస్తారని కమిషనర్ అన్నారు బూత్ లెవెల్ ఆఫీసర్లు ప్రజల ఇంటి దగ్గరికి వచ్చినప్పుడు ప్రజలు కేవలం 10 నుంచి 15 నిమిషాలు కేటాయించి బి. ఎల్. ఓ తన ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేసేంతవరకు సహకరించవలసిందిగా కోరారు. డిసెంబర్ 5 లోపు, వోటర్ల పేర్లలో కాని, చిరునామాలో కానీ ఎటువంటి మార్పులు చేయాలన్న, ఉదాహరణకు పేరులో తప్పులను సరి చేయటం, ఫోటోలు మార్పిచ్చటం వంటి ప్రక్రియలు ఏవైనా కావాలన్నా, తమ బి.ఎల్.ఓ ద్వారా కాని, ఓటర్ హెల్ప్ లైన్ యాప్ ద్వారా కానీ, ఎన్.వి.ఎస్.పి పోర్టల్ ద్వారా కానీ, మార్పులు చేసుకోవచ్చు లేదా విజయవాడ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కొచ్చి ఒక ఫోరంను నింపితే సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందని కమిషనర్ అన్నారు. ఈ పర్యటనలో కమీషనర్ తో పాటు సిటీ ప్లానర్ జీ.వి.జీ.ఎస్.వి ప్రసాద్, నార్త్ తహసిల్దార్ యం. మాధురి, ఎ.సి.పి జగదీష్ పాల్గొన్నారు.





## ఈనో చూవీ బైట్స్ విడుదల

**గుంటూరు, మేజర్ న్యూస్ :** హేలియన్ సంస్థకు చెందిన ప్రముఖ డైజెస్టివ్ బ్రాండ్ ఈనో.. ఇప్పుడు నమిలేందుకు అనువైన యాంటా సిడ్, ఈనో చూవబుల్ బైట్స్ ను టాంగీ లెమన్, జెస్టీ ఆరెంజ్ రెండు రుచులలో విడుదల చేస్తునట్లు ప్రకటించింది. కొత్త ఈనో చూవబుల్ బైట్స్ అనేది ఆధునిక జీవనశైలి, బయట తినే అలవాట్లకు అనుగుణంగా రూపొందించిన ఒక ఆవిష్కరణ. ఈనో చూవబుల్ బైట్స్ సహజ పదార్థాలను కలిగి ఉంటుంది. ఇందులో 1000 మి.గ్రా ఖటికా చూర్ణ శక్తిని కలిగి ఉండగా, ఇది ఒక నిమిషంలోపు ఎసిడిటీపై పని చేస్తుంది. ఇది సింగిల్స్ పిల్లో పౌచ్, 10ల ప్యాక్, 30ల ప్యాక్ మూడు ఎస్కెయులలో లభిస్తుంది.

## పేదల బ్రతుకులు మారాలంటే మళ్ళీ జగనన్నే రావాలి



**నందివాడ, మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్కి జగనన్న ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని అరిపిరాల గ్రామ పంచాయతీలో కార్యాలయంలో సర్పంచ్ గోవాడ వసుంధర, వైసీపీ సీనియర్ నాయకులు నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ ఆదాం మాట్లాడుతూ ప్రత్యక్ష, పరోక్ష నగదు బదిలీ ద్వారా 4810 లబ్ధిదారులకు 11 కోట్ల 67 లక్షల రూపాయల ప్రయోజనం చేకూరిందన్నారు. అభివృద్ధి కార్యక్రమాల ద్వారా మరొక 4 కోట్ల 88 లక్షల రూపాయలు మొత్తం కలిపి సుమారు 16 కోట్ల 55 లక్షల రూపాయల లబ్ధి చేకూరిందని ఆదాం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామాపురం సర్పంచ్ మేడిపల్లి ప్రసాద్, ఎంపీటీసీ గోవాడ నిర్మల కుమారి,వైసిపి నాయకులు సచివాలయం కన్వీనర్ కాజా రంగారావు, మండలంలో గల వివిధ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, మండల అధికారులు, నందివాడ ఎంపిడిఓ వి.ఎస్ నాగేశ్వరరావు, ఎమ్మార్వో భవన్నారాయణ,అరిపిరాల పంచాయతీ సెక్రటరీ వి.వినోద్ కుమార్, సచివాలయం సిబ్బంది,గ్రామ వాలంటీర్స్, సచివాలయ సిబ్బంది,రెవెన్యూ సిబ్బంది, వాలంటీర్స్,గృహ సారథులు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఓటర్ల జాబితా నుండి

# మరణించిన ఓటర్లను తొలగించండి



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను అనుసరించి, ఓటర్ల జాబితా నుండి మరణించిన ఓటర్లను తొలగించాలని, అలాగే ఓటర్ల రీ వెరిఫికేషన్ నిర్వహించాలని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, సెంట్రల్ నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, మంగళవారం తమ చాంబర్లో పొలిటికల్ పార్టీ ప్రతినిధులు తో పొలిటికల్ రివ్యూ మీటింగ్ లో అధికారులకు ఆదేశించారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా జరగాలని ఎటువంటి తప్పులు ఉండకూడదని అధికారులకు ఆదేశాన్ని ఇచ్చారు. ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను అనుసరించి, నకిలీ ఓటర్లను, శాశ్వతంగా మారిన ఓటర్లను గుర్తించి వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైతే తహశీల్దార్ (సెంట్రల్) కూడా సాయంత్రం సమయంలో సంబంధిత బీఎల్వో/బీఎల్ఏతో కలిసి ఫీల్డ్ సర్వే చేయవలసిందిగా ఆదేశించారు. విజయవాడ సెంట్రల్లో 80 లోని అన్ని పోలింగ్ స్టేషన్లలో అనగా 1 నుండి 257 వరకు సాయంత్రం 05:00 నుండి 06:00 గంటల వరకు బీఎల్వోలు బీఎల్ఏలతో సమావేశం నిర్వహించాలని, నమోదు, తొలగింపులు, బదిలీలు మొదలైన వాటి గురించి, అవసరమైన ఫీల్డ్ వెరిఫికేషన్లు చేపట్టాలి అన్నారు. అన్ని ఏఈఆర్ఓ తమ తమ ప్రాంతాల్లో, ఎవరైనా నిరాశ్రయులైన వ్యక్తులు ఉన్నట్లయితే, అవసరమైన ఫారమ్లను సక్రమంగా పొందడం ద్వారా వారిని ఓటర్లుగా నమోదు చేసుకునేలా చూసుకోవాలి అని అన్నారు. విజయవాడలో ఉన్న సెంట్రల్ నియోజకవర్గంలో అన్ని కేంద్రాల ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు మల్లాది విష్ణు (వైసీపీ), ఎం సాంబశివరావు(టీడీపీ), బి.రమణారావు(సీపీఐ), యన్. వీరేంద్ర రావు (సీపీఐ),యం. వినోద్ కుమార్ (బహుజన్ సమాజ్ పార్టీ ), సిటీ ప్లానర్ జీవి జీ ఎస్ వి ప్రసాద్, జెడ్ సి-2 మల్యాద్రి, తాసిల్దార్ సెంట్రల్ వెన్నెల శ్రీను, నార్త్ తాసిల్దార్ ఎం మాధురి, ఎస్ ఇ (ప్రాజెక్ట్స్) కే రామ్మోహన్రావు, ఏసిపి -2 ఎం జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

# నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలి



**విజయవాడ, మేజర్ న్యూస్ :** గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులను వేగవంతం చేసేందుకు వారంవారిగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ డిల్లీరావు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనుల ప్రగతిని పంచాయితీరాజ్, ఆర్ డబ్ల్యు ఎస్ ఇంజినీర్లు, నగరపాలక సంస్థ, తిరువూరు, జగ్గయ్యపేట. నందిగామ మున్సిపల్ కమీషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ జీజీఎంపీలో మంజూరైన పనులు ఇప్పటివరకు పూర్తైన పనులు, అప్లోడ్ చేసిన బిల్లులు, విడుదలైన మొత్తం తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాలో ఈ కార్యక్రమంలో మంజూరుచేసిన 1,156 పనుల్లో పూర్తయినవి మినహా వివిధ దశల్లో ఉన్న పనులను వేగవంతం చేయాలన్నారు. పూర్తయిన పనులకు సంబంధించి నిధులను ఎప్పటికప్పుడు మంజూరు చేస్తున్నామని అదేవిధంగా పనులకు సంబంధించి బిల్లులను అప్లోడ్ చేయడం ద్వారా త్వరితగతిన నిధుల మంజూరుకు అవకాశం ఉంటుందన్నారు. అధికారులు తుది దశలో ఉన్న పనులపై దృష్టిసారించి పనుల పూర్తికి కృషిచేయాలన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా శాఖల పరిధిలో మంజూరు చేసిన పనులతో పాటు విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్, ఇతర మునిసిపాలిటీల పరిధిలో మంజూరు చేసిన పనుల ప్రగతిని ఆయా శాఖల విభాగాధిపతులు, కమిషనర్లు ఎప్పటికప్పుడు పరిశీలించి, సమస్యలు ఏవైనా ఉంటే పరిష్కరించి పనుల పూర్తికి కృషిచేయాలన్నారు. అధికారులు స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో పనులను సత్వరం పూర్తిచేసేందుకుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిల్లీరావు అన్నారు.

ఈ కాన్ఫరెన్స్ లో విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితిసింగ్,పంచాయితీరాజ్ ఎస్సి ఎ. వెంకటేశ్వరరావు, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్సి డీవి. రమణ, సీపీవో వై.శ్రీలత, నందిగామ ఆర్డీవో పి.సాయిబాబా, తిరువూరు ఆర్డీవో కె.మాధవి, జగ్గయ్యపేట, తిరువూరు, నందిగామ మునిసిపల్ కమీషనర్లు పాల్గొన్నారు.



## ఆత్మహత్య చేసుకున్న చంద్ర కుటుంబానికి

# దాతల సాయం

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న దివంగత సిటీకేబుల్ జర్నలిస్ట్ చంద్ర కుటుంబానికి వైయస్ఆర్‌సిపి రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి మాజీ ఉపసర్పంచ్ గాజుల జయగోపాల్ ఫ్రెండ్ సర్కిల్ 25,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందచేశారు. అవనిగడ్డ ప్రెస్‌క్లబ్ కార్యదర్శి పుట్టి శ్రీనివాసరావుకు మంగళవారం ప్రెస్‌క్లబ్ వద్ద జయగోపాల్ నగదును అందచేశారు. చంద్ర కుటుంబానికి గాజుల పోతురాజు ద్వారా మరో 10 వేల రూపాయలను చంద్ర కుటుంబానికి ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావుకు అందచేయగా అవనిగడ్డలో ఒక అధికారి కె శ్రీనివాసరావు 10 వేల రూపాయలను చంద్ర కుటుంబానికి అందచేయగా మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాషా 2 వేల రూపాయలను పుట్టి శ్రీనివాసరావుకు అందచేయగా దాతలకు ప్రెస్ క్లబ్ తరుపున అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఆలీ, సీనియర్ పాత్రికేయులు దివి సారంగపాణి, ప్రెస్‌క్లబ్ సభ్యులు కోట సుబ్బారావు, అలపర్తి గోపాలకృష్ణ, కోట యూరిగగారిన్, చందు శ్రీనివాసరావు, జె ఎస్ శాస్త్రి లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఉచిత గ్యాస్ కనక్షన్

అవనిగడ్డ మేజర్ న్యూస్ : ఉజ్వల పథకం ద్వారా తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉచితంగా గ్యాస్ కనక్షన్ తీసుకోవచ్చని అవనిగడ్డ విజయ కృష్ణ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మత్తి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. గతంలో ఏ ఏజెన్సీలోనూ గ్యాస్ కనక్షన్ లేని వారు తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న వారు మాత్రమే ఈ ఉచిత గ్యాస్ కనక్షన్‌కు అర్హులని చెప్పారు. ఈ అవకాశాన్ని అవనిగడ్డ మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాలకు 9030111362 గానీ 9848272048 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## సత్య సాయి బాబా జన్మదినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే



నందిగామ, నవంబర్ 21, మేజర్ న్యూస్: పట్టణంలో భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి 98 వ జన్మదినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు పాల్గొన్నారు.శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో వితరణతో అందజేసిన 12 కుట్టుమిషన్లను పేద మహిళలకు.. 98 మంది పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు.అనంతరం శ్రీ సత్య సాయి బాబా వారి పాదుకులకు ప్రత్యేక అభిషేక కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు.మానవీయ విలువలను పాటించి ఐక్యత, సఖ్యత, ఆధ్యాత్మికత, మంచి ఆలోచనలతో మనిషి సుఖశాంతులతో జీవించాలని బాబా చూపిన మార్గం స్ఫూర్తిదాయకమని తెలిపారు.సత్యసాయి సేవా సంస్థలు ప్రపంచ నలుమూలలా విశిష్ట సేవలందిస్తున్నాయని నందిగామలో కూడా శ్రీ సత్య సాయి సేవా సమితి సేవలు అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సత్య సాయి బాబా కమిటీ కన్వీనర్ ఉప్పుటూరి వాసుదేవరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# స్పందనలో జనసేన యువ నాయకుడు గరికపాటి జన్మదినోత్సవం



**గన్నవరం, నవంబరు 21, మేజర్ న్యూస్ :** జనసేన యువ నాయకులు గరికపాటి శివశంకర్ జన్మదినోత్సవం గన్నవరం మండలం దావాజిగూడెం లో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పందన మానసిక వికాస కేంద్రంలో మంగళవారం నాడు ఎంతో ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా జనసేన యువ నాయకులు గరికపాటి శివశంకర్ మాట్లాడుతూ స్పందనలో దివ్యాంగుల మధ్యలో జన్మదినోత్సవం జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని,ఈ రోజు చేసుకున్న పుట్టిన రోజు ఎప్పటికీ మరచిపోలేనదని ఆయన అన్నారు. జనసేన అధినేత కొణిదెల పవన్ కల్యాణ్ సమాజానికి చేస్తున్న సేవలు చూచి అదే స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానని, పవర్ స్టార్ లాంటి గొప్ప లీడర్లు నేటి తరానికి అత్యంత అవసరమని శివశంకర్ అన్నారు. పవన్ కల్యాణ్ ఎప్పుడూ దివ్యాంగులకు అండగా ఉండాలని చెబుతుంటారని ఆయన అన్నారు.జనసేన కార్యకర్తలకు ఏ కష్టం వచ్చిన అండగా ఉంటానని ఆయన అన్నారు. గన్నవరం ప్రాంతంలో దివ్యాంగుల కొరకు స్పందన మానసిక వికాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఉచితంగా విద్యా వైద్య రవాణా భోజన సౌకర్యాలు అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ ను శివశంకర్ అభినందించారు. స్పందన నూతన నిర్మాణానికి పది వేలు రూపాయలు అందించడం జరిగిందని, భవిష్యత్తులో స్పందన మానసిక వికాస కేంద్రానికి తోడ్పాటు అందిస్తామని, మరిన్ని సేవాకా ర్యక్రమాలతో ముందుకు వెళ్లాలని ఆయన పేర్కొన్నారు. ఎంతో ఓర్పు తో స్పందన లో దివ్యాంగులకు అన్ని సౌకర్యాలు అందేలా పర్యవేక్షణ చేస్తున్న సంస్థ సెక్రటరీ సంకాబత్తుల రజిత వెంకట్ ను అభినందనలు తెలి పారు. నిరంతరం దివ్యాంగులకు సేవలు చెయ్యడమే కాకుండా పేదలకు విద్యార్థులకు, వృద్ధులకు చేస్తున్న సేవలను శివశంకర్ ప్రసంశించారు. కరోనా క్లిష్టమైన పరిస్థితులలో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో వేలాది మందికి చేసిన సేవలు మాటలు చాలవని జనసేన నాయకులు శివశంకర్ అన్నారు. హ్యాండ్స్ సొసైటీ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ మాట్లాడుతూ జనసేన నాయకులు గరికిపాటి శివశంకర్ జన్మదినోత్సవం స్పందన లో దివ్యాంగుల మధ్యలో జరుపుకోవడం మానవత్వం నకు నిదర్శనమని ఇలాంటి పుట్టిన రోజులు మరిన్ని చేసుకోవాలని, ఉన్నతమైన స్దానం భగవంతుడు ఇవ్వాలని తద్వారా పేదలకు మరిన్ని సేవాకార్యక్రమాలు చెయ్యాలని ఆయన అన్నారు. చిన్న వయసులోనే శివశంకర్ విశాలమైన హృదయంతో పేదలకు చేస్తున్న వెంకట్ అభినందనలు తెలిపారు.

అనంతరం స్పందన బాలలకు స్వీట్లు, పండ్లు, పుస్తకాలు, పెన్నులు,బాక్స్ లు పంపిణీ చేసారు. గరికపాటి శివశంకర్ కి హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ తరుపున సత్కరించడం జరిగింది. శివశంకర్ కి, జనసేన నాయకులకు రజిత వెంకట్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో గన్నవరం మండలం జనసేన అధ్యక్షులు పచ్చిపాల లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి కోలవెన్ను నాని, దుంపల సంధ్యా రాణి చిల్లర రాజేష్, బండి కిషోర్ కుమార్, పల్లి కార్తీక్, బావిశెట్టి ప్రదీప్, రామరాజ్, సిరాజ్,బాబి, రోషయ్య, సతిష్, కిషోర్, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

# వీరపనేనిగూడెంలో పల్లెకుపోదాం కార్యక్రమం

**గన్నవరం, నవంబర్ 21, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని వీరపనేనిగూడెంలో మంగళవారం పల్లెకుపోదాం ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం ఆవరణలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఆ సచివాలయ పరిధిలో వివిధ పథకాలు ద్వారా లబ్ధిచేకూరిన వివరాల బోర్డ్ ను జడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి ఆవిష్కరించారు. అనంతరం గ్రామ సర్పంచ్ అరేపల్లి జేజిమ్మ అధ్యక్షతన జరిగిన సభలో పలువురు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాలుగా మేలు చేసింది కాబట్టి మళ్ళీ జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ కు సీఎంగా చేసుకోవాలని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందాలంటే ఎమ్మెల్యేగా వల్లభనేని వంశీని, సీఎంగా జగన్మోహన్ రెడ్డి గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ సెంటర్ లో వైఎస్సార్ సీపీ జెండాని పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ రామిశెట్టి అంజనీ కుమారి, గ్రామ ఉపసర్పంచ్, వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు బండి నాగ సాంబిరెడ్డి, ఎంపీటీసీ నందిపాటి పద్మావతి, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు నీలం బాలు, సచివాలయ జేఏసీ కన్వీనర్ కైలే శివకుమార్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.వి.ఆర్, వార్డు మెబర్లు బొమ్మారెడ్డి హరీష్ రెడ్డి, వడ్లమూడి శేఖర్, విద్యాకమిటి అధ్యక్షుడు రెడ్డి శ్రీను, ఈఓపిఆర్డీ, పంచాయతీ కార్యదర్శి బాపూజీ,పార్టీ నాయకులు అరేపల్లి వెంకటేశ్వరరావు, నందిపాటి సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ బత్తుల పానకాలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



# వైసీపీతోనే అభివృద్ధి సాధ్యం





**నందిగామ, నవంబర్ 21, మేజర్ న్యూస్:** పట్టణంలోని 17, 1వ వార్డులో సచివాలయం పరిధిలో "వై ఏపీ నీడ్స్ జగన్" కార్యక్రమంలో భాగంగా సంక్షేమం, అభివృద్ధి వివరాలను డిస్ ప్లే బోర్డ్ లను ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ ఆవిష్కరించారు. అనంతరం వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు గ్రాఫిక్స్ పరిపాలన చేస్తే.. వైయస్ జగన్ పేదల పక్షాన నిలబడి సామాన్యులకు అండగా పాలన సాగిస్తున్నారు.గత తెలుగుదేశం హయాంలో కేవలం ఒక సామాజిక వర్గానికి పదవులు దక్కేవి.. కానీ నేడు వైయస్ జగన్ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఉన్నత పదవులతో పాటు గౌరవం లభిస్తుంది.తెలుగుదేశం పార్టీ హయాంలో నందిగామలో ఎమ్మెల్యే ను కలవాలంటే.ఎవరినైనా పెద్ద నాయకుడిని తోడు తీసుకొని వెళ్ళాలి. కానీ నేడు నందిగామలో ఆ పరిస్థితి లేదు.ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావుని కలవాలంటే ఎవరైనా నేరుగా రావచ్చు.గత చంద్రబాబు ప్రభుత్వంలో పథకాలు కావాలంటే ఇంటిపై జెండా కట్టాలి. తెలుగుదేశం నాయకుల ఇళ్ల చుట్టూ తిరగాలి.. కానీ నేడు జగనన్న పాలనలో నేరుగా మీ ఇంటికే వాలంటీర్లు వచ్చి అన్ని సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించి, నేరుగా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారు.గత చంద్రబాబు ప్రభుత్వంలో మాదిరిగా మధ్యవర్తులు, దళారులు, బ్రోకర్లు, జన్మభూమి కమిటీ సభ్యులు నేటి పరిపాలనలో లేరు..జగనన్న పాలనకు చంద్రబాబు పాలనకు తేడాను ప్రజలు గమనించాలి.నందిగామలో గత ఐదేళ్లు పాలించిన తెలుగుదేశం ఎమ్మెల్యే సాధించింది ఏమీ లేదు.నేడు నందిగామ అభివృద్ధి దిశగా పరుగులు పెడుతుంది అంటే కేవలం ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు కృషితోనే అభివృద్ధి చేస్తున్న వారికే ప్రజలు అండగా ఉండాలి అన్నారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ జయరాం,స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# నిజం గెలిచింది-న్యాయం గెలిచింది



అవనిగడ్డ, మేజర్ న్యూస్ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పై రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిన విషయంలో నిజమే గెలిచిందని, న్యాయమే గెలిచిందని తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు బండే కనకదుర్గ అన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కేసులో తమ నాయకుడు చంద్రబాబుకు బెయిల్ రావడంతో మంగళవారం సాయంత్రం స్థానిక రాజీవ్ గాంధీ చౌక్‌లో చంద్రబాబు చిత్రపటానికి తెలుగు మహిళలు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయ వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకం పెరిగిందని అన్నారు. చంద్రబాబు కు బెయిల్ రావడం హర్షించదగ్గ విషయమని, లక్షలాదిమంది ఆశలు ఫలించాయని అన్నారు. సుప్రీంకోర్టు లో పెండింగ్ లో ఉన్న క్వాష్ పిటిషన్ లో కూడా తీర్పు ఇదేవిధంగా రావాలని కోరుకుంటున్నామని తెలిపారు. నవంబర్ 29 నుండి చంద్రబాబు ఎటువంటి ఆంక్షలు లేకుండా ప్రజాక్షేత్రంలోకి రానున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మోపిదేవి ఎంపీపీ రావి దుర్గావాణి, చల్లపల్లి ఎంపీపీ కోట విజయ రాధిక, తెలుగుదేశం మహిళా జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి దివి యుగంధరి, మాజీ ఎంపీపీ మోర్ల జయలక్ష్మి, బోలెం నాగమణి, పోతుమర్తి నాగమణి,కనగాల రాధ, కొల్లూరి పాలిని, జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, కోడూరు మండల అధ్యక్షులు బండే శ్రీనివాసరావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మద్దూరి కాంతారావు, మండలి రామమోహనరావు, బచ్చు రఘునాథ్, మేడికొండ విజయ్, బర్మా శ్రీను, దాసినేని శ్రీనివాసరావు, గుగ్గిలం శ్యాం కుమార్, బడే సుబ్బారావు, ఎలవర్తి చిన్న, విశ్వనాధుని మురళి, కొట్టే విజయ్, మెగావతు గోపి, తదితరులు పాల్గొన్నారు.

## కేవీఆర్ విద్యార్థికి సిల్వర్ మెడల్



నందిగామ నవంబర్ 21 మేజర్‌న్యూస్ : వెయిట్ లిఫ్టింగ్‌లో సిల్వర్ మెడల్ సాధించిన తరుణ్‌ను కెవిఆర్ కళాశాల యాజమాన్యం అభినందించారు. శ్రీకాకుళం జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టెన్త్ సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ 17 టు 19 నవంబర్ 2023న గుండు విల్లిపేట నరసన్నపేటలో జరిగినవి.నందిగామ కెవిఆర్ కాలేజ్ విద్యార్థి బిట్ర తరుణ్ ఆదిత్య 73 కేజీల విభాగంలో మొత్తం222 కేజీలు బరువు నెత్తి సిల్వర్ మెడల్ సాధించారు.మంగళవారం తరుణ్ ఆదిత్యను కాలేజీ యాజమాన్యం ఎర్రం రెడ్డిబాబురావు, గోపాలకృష్ణ మూర్తి, ప్రిన్సిపల్ డాక్టర్ రాయప్ప ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ వాసిరెడ్డి, గేమ్స్ కమిటీ సభ్యులు అభినందనలు తెలియజేశారు.

## ఉభయ ముక్తేశ్వర స్వామి వారికి విశేష పూజలు



అవనిగడ్డ మేజర్ న్యూస్ : ఉభయ ముక్తేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని వేదమంత్రోచ్ఛారణల నడుమ నిర్వహించారు. మండల పరిధిలోని వేకనూరు గ్రామంలో విచ్చేసి ఉన్న ఉభయ ముక్తేశ్వర స్వామి వారికి మంగళవారం వేకువ జామునే ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించి స్వామి వారిని విశేషంగా అలంకరించారు. తాడిగడప వెంకటేశ్వర ప్రసాద్ బ్రహ్మత్వంలో మరో 11 మంది వేదపండితులు స్వామి వారికి వేదమంత్రోచ్ఛారణల నడుమ లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.



## ముగిసిన వార్షిక సప్తాహం

అవనిగడ్డ మేజర్ న్యూస్ : రామాలయంలో కార్తీక మాస వార్షిక సప్తాహం ప్రశాంతంగా ముగిసింది. మండల పరిధిలోని మోదుమూడి గ్రామంలో వేంచేసి ఉన్న రామాలయంలో కార్తీక మాస వార్షిక సప్తాహం వెంకట దాస్ భక్త బృందం ప్రారంభించిన వార్షిక సప్తాహ కార్యక్రమం మంగళవారం 108 సార్లు హనుమాన్ ఛాలీసా పారాయణంతో ముగిసింది. ఈ 7 రోజులు స్వామి వారికి కుంకుమ అర్చనలు, అభిషేకాలు, విష్ణు, సహస్ర నామ పారాయణం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమాన్ని శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు పాల్గొని ప్రారంభించి స్వయంగా వడ్డించారు. ఈ గ్రామంలో తరతరాలుగా వస్తున్న వార్షిక సప్తాహం అని ఆలయ ధర్మకర్త గగాధర జగదీష్ ప్రసాద్ చెప్పారు. జరిగిన అన్నదాన కార్యక్రమంలో 3 వేల మందికి పైగా భక్తులు పాల్గొని స్వామి వార్లను దర్శించుకుని తీర్ధ అన్నప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎల్ శివరామకృష్ణ, సిఐ రమేష్, జెస్ విద్యా వాలంటీర్ బచ్చు ఆదినారాయణరావు, గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రేపే కోటి దిపోత్సవం

అవనిగడ్డ మేజర్ న్యూస్ : గ్రామంలో వేంచేసి ఉన్న లక్ష్మీనారాయణ స్వామి వారి ఆలయంలో కార్తీక ఏకాదశిని పురస్కరించుకుని గురువారం ఉదయం 7 గంటలకు స్వామి వారికి అభిషేకం, లక్ష తులసీ పూజ 10 గంటల నుండి సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, సాయంత్రం 6 గంటలకు కోటి దిపోత్సవం జరుగుతుందని ఆలయ ధర్మకర్తలు, అర్చక బృందం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోటి దిపోత్సవంలో విశేషంగా ఆవు నెయ్యితో తడిపిన 365 ఒత్తులు కలిగిన ప్రమిదులు ఉంచి ఒకొక్క భక్తుడు 365 ఒత్తులు వెలిగించే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందని భక్తజనులందరూ పెద్ద ఎత్తున పాల్గొని కోటిదిపోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేసి స్వామి వారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.

# మత్స్యకార సంక్షేమం గాలికి వదిలేసి మత్స్యకార దినోత్సవ వేడుకలా ?



అవనిగడ్డ మేజర్ న్యూస్ : మత్స్యకారుల సంక్షేమాన్ని గాలికి వదిలేసి మత్స్యకార దినోత్సవాన్ని జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నిర్వహించడం విడ్డూరంగా ఉందని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నాగాయలంకలో ఫిష్ ల్యాండిగ్ పనులను నిలిపివేసి, జలక్రీడల కేంద్రాన్ని మాయం చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానిదే అని బుద్ధప్రసాద్ విమర్శించారు. రాష్ట్రంలో 20 లక్షల మంది మత్స్యకారులు ఉంటే మత్స్యకార భరోసా కేవడం లక్ష మందికి మాత్రమే పరిమితం చేశారని మండలి అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం మత్స్యకారులకు వలలు, పడవలు, ఐస్‌బ్యాక్సులు, మోటర్ సైకిల్స్, ఆటోలు, వ్యాన్లు 70 నుండి 90 శాతం సబ్సిడీతో అందిస్తే ఆ స్కీమ్స్ అన్నీ నేడు ఏమైయ్యాయి అన్నారు. చెరువులు, రిజర్వాయర్‌లో చేప పిల్లలు వదిలే పథకాన్ని నిర్వీర్యామం చేసిన ఘనత వైసిపి కే దక్కిందన్నారు. జిఓ నెం 2017 ద్వారా ఫిషర్ మ్యాన్ సొసైటీల ఆధ్వర్యంలో ఉన్న రిజర్వాయర్లకు వేలం వేసి సొసైటీలను నిర్వీర్యామం చేశారని, మత్స్యకారులు నివసించే తీరప్రాంత గ్రామాల రహదారులు అధ్వానస్థితిలో ఉన్నాయని, సాగునీటి, త్రాగునీటి సమస్యలతో మత్స్యకారులు తల్లడిల్లిపోతుంటే ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదని మండలి విమర్శించారు. ఆక్వా రంగంలో విద్యుత్ చార్జీలను తెలుగుదేశం ప్రభుత్వంలో 2 రూపాయలు తగ్గిస్తే, నేడు ఆక్వాజోన్- నాన్ ఆక్వాజోన్ అంటూ 5-8.5 రూ॥ వరకు వసూలు చేస్తున్నారని చంద్రబాబు నాయుడు పాలనలో ఏరియేటర్లు, బోర్లు, మోటర్లపై 50 శాతం సబ్సీడీ ఇస్తే, నేటి ప్రభుత్వం ఎగ్గొట్టారని, ఆక్వా ఉత్పత్తులు కిలోకి పావలాగా ఉన్న సెస్‌ను రూపాయి చేశారని తెలుగుదేశం అధికారంలోని వస్తే ఆక్వా రైతులందరికి రూ. 1.50 పై॥లు యూనిట్ విద్యుత్‌ను ఇస్తామని మండలి చెప్పారు. మత్స్యకార వర్గానికి చెందిన మాజీ మంత్రి కొల్లు రవీంద్రపై తప్పుడు కేసులు పెట్టి వేదిస్తున్నారని బుద్ధప్రసాద్ పేర్కొన్నారు.



## భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం

మచిలీపట్నం, మేజర్‌న్యూస్ : ప్రజలకు గుండు కొట్టించి నవరాలు చౌకగా అమ్మినట్టుగా ఉంది ఈ ప్రభుత్వ పాలన అని జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డం రాజు విమర్శించారు. చంద్రబాబు పవన్ బాబు షూరిటీలో రాష్ట్ర భవిష్యత్తు గ్యారెంటీ అని జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డం రాజు తెలిపారు. 26వ డివిజన్లో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న గడ్డం రాజు రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకుని జనసేన టిడిపి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు. జనసేన టిడిపి ఉమ్మడి మేనిఫెస్టోను వివరిస్తూ రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక యువత పక్క రాష్ట్రాల వైపు తరలిపోతున్నారని అన్నారు. పెరిగిపోతున్న నిత్యవసర ధరలు ఓవైపు విద్యుత్ ధరలు మరోవైపు పేద మధ్యతరగతి బతుకులు భారంగా మారాయని ఓటర్లకు తెలియజేశారు. జనసేన టిడిపి రథసారథులు బండి రామకృష్ణ కొల్లు రవీంద్ర నాయకత్వాన్ని బలపరచాలని గడ్డం రాజు తెలిపారు. తమ ఓటు ఎక్కడ ఉన్నదో ధ్రువీకరించుకుని బాధ్యతగా ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని ఓటు నమోదు మార్పు చేర్పులకు ఉన్న అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని గడ్డం రాజు కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అక్కుమంతి రాజా, వన్నెం రెడ్డి వనవెంకట ప్రసాద్, గడ్డం రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపిన సత్యనారాయణ




మచిలీపట్నం, మేజర్‌న్యూస్ : రాష్ట్రంలో ఏర్పడిన తీవ్ర కరువు సమస్య పై సిపిఐ ఆధ్వర్యంలో విజయవాడలో ధర్నా చౌక్ వద్ద చేపట్టిన 30 గంటలు నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపిన రాష్ట్ర తెలుగు రైతు అధ్యక్షులు మర్రి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ. రాష్ట్రంలో తీవ్రమైన కరువు సమస్య, కృష్ణా జలాల పునః పంపిణీకై కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ల పై, కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులు పైన మొండివైఖరిని నిరసిస్తూ, భారత కమ్యూనిస్టు పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో 30 గంటల నిరాహార దీక్ష సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి వల్లూరు పల్లి గణేష్, కృష్ణాజిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షులు వేముల శివాజీ, కృష్ణాజిల్లా తెలుగు రైతు సోషల్ మీడియా కోఆర్డినేటర్ పామర్తి లక్ష్మణ్, మచిలీపట్నం కార్పొరేట్ తెలుగు రైతు అధ్యక్షులు ఆద మాధవ, ఈమన ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణా తరంగ్ గోడ పత్రిక ఆవిష్కరణ



మచిలీపట్నం, మేజర్‌న్యూస్ : కృష్ణా తరంగ్ 2023 గోడ పత్రిక ను కృష్ణా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి ఆవిష్కరించారు. మంగళవారం విశ్వవిద్యాలయ సెనేట్ హాల్లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఉపకులపతి మాట్లాడుతూ ఈ నెల 30, డిసెంబర్ 1,2 తేదీలలో మూడు రోజుల పాటు కృష్ణా తరంగ్ 2023 పేరిట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఐదు విభాగాలలో 27 అంశాలపై పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అంశాలలో విజేతలుగా నిలిచిన వారు ఆంధ్ర విశవవిద్యాలయంలో జరిగే దక్షిణ మండల (సౌత్ జోన్) పోటీలలో పాల్గొంటారని తెలిపారు. మూడు రోజులు పాటు జరిగే కార్యక్రమాల్లో సుమారు రెండు వేల మంది విద్యార్థులు పాల్గొంటారని ఆశాభావం వ్యక్తంచేశారు. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు ను ఇప్పటికే ప్రారంభించడం జరిగిందన్నారు. పోటీలలో పాల్గొనే వారి కోసం భోజన, వసతి ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశం లో రిజిస్ట్రార్ డా వీరబ్రహ్మాచారి, ఆచార్య సుందర కృష్ణ, ఆచార్య మారుతి, ఆచార్య దిలీప్, సహా ఆచార్యులు కోటేశ్వరరావు, నవీన లావణ్యలత, డా. శ్రావణి, డా. విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనం పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యతనిద్దాం







**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ కార్యాలయాల్లో దైనందిక విధులతో పాటు పచ్చదనం, పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చి మొక్కల పెంపకం, పరిసరాల పరిశుభ్రత వంటి చర్యల్లో అధికారులు, సిబ్బంది భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు సూచించారు. దైనందిక విధుల్లో భాగంగా మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ డిల్లీరావు నగరంలోని కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకొని కొద్దిసేపు పరిసరాలను పరిశీలించి, మొక్కల పెంపకం, పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య చర్యలపై అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు పనిచేసే కార్యాలయాల ఆవరణలో పచ్చదనంతో ఆహ్లాదకర వాతావరణం, కార్యాలయాల్లో పరిశుభ్రత ఉన్నప్పుడు మానసిక ప్రశాంతతో మరింత ఉత్సాహంతో పనిచేసేందుకు అవకాశముంటుందన్నారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ అనంతరం ఏర్పడిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌ను మోడల్ కలెక్టరేట్‌గా తీర్చిదిద్దేందుకు అధికారులు, సిబ్బంది సహకారమవసరన్నారు. ఇప్పటికే మొక్కల పెంపకం, పచ్చనైన వాతావరణాన్ని కల్పించేందుకు తీసుకున్న చర్యలు అభినందనీయమని.. అయితే తాత్కాలికంగా కాకుండా భవిష్యత్తుకు ఉపయోగపడే మొక్కలను నాటి, పెంచాల్సిన బాధ్యత చేపట్టాలన్నారు. గ్రాండీఫ్లోరా, రాంబ్లర్, మీనియేచర్, హైబ్రిడ్ టీ వంటి కనువిందు చేసే పూలమొక్కలతో పాటు రావి, వేప, టేకు, మామిడి, నేరేడు తదితర మొక్కలను నాటితే ఫలాలతో పాటు నీడనిచ్చేందుకు దోహదపడతాయన్నారు. కలెక్టరేట్‌లోని మరుగుదొడ్లను పరిశీలించి.. పురుషుల మరుగుదొడ్లు, స్త్రీల మరుగుదొడ్లకు మధ్య, మరుగుదొడ్ల తలుపులకు ముందువైపు అడ్డుగోడలను నిర్మించి, వినియోగించుకునే వారికి ప్రైవసీ ఉండేలా చూడాలన్నారు. పచ్చదనం పరిశుభ్రత, పారిశుధ్యం నిర్వహణలో కలెక్టరేట్‌ను ఇతర కార్యాలయాలకు ఆదర్శవంతంగా ఉండేలా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టరేట్ ఆవరణ పరిశీలనలో కలెక్టర్ వెంట పరిపాలన అధికారి ఇంతియాజ్ పాషా, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, కలెక్టర్ వ్యక్తిగత కార్యదర్శి సతీష్ కుమార్, గార్డెన్ నిర్వాహకులు స్వామి, సిబ్బంది ఉన్నారు.

## ధాన్యం సేకరణ, పర్యవేక్షణ సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** ధాన్యం సేకరణ, పర్యవేక్షణ సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ లో ధాన్యం సేకరణకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు దీనిలో భాగంగా ధాన్యం విక్రయాలలో ఎటువంటి ఇబ్బందులు సందేహాలు, సమస్యలు ఉంటే పరిష్కరించడానికి జిల్లా మేనేజర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. కంట్రోల్ రూమ్ లో ఇద్దరు సిబ్బంది అందుబాటులో ఉంటారని ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు రైతులు తమ ఫిర్యాదులను, సందేహాలను, సమస్యలను తెలపవచ్చునున్నారు. ధాన్యం సేకరణలో రైతులకు ఎదురైన సమస్యలను జిల్లా మేనేజర్ కంట్రోల్ రూమ్ నెంబర్ 77020 03571కు ఫోన్ చేసి తమ ఫిర్యాదులు సమస్యలు తెలిపినట్లయితే తగిన పరిష్కారం, సూచనలు పొందవచ్చునని జాయింట్ కలెక్టర్ జిల్లా డా.పి. సంపత్ కుమార్ ఆ ప్రకటనలో తెలిపారు.

## వినియోగదారుల హక్కుల వినూత్న అవగాహన కార్యక్రమాల నివేదికలను డిసెంబర్ 8లోగా పంపాలి

**విజయవాడ, మేజర్ న్యూస్ :** వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించేందుకు, పరిరక్షించేందుకు ఏటా డిసెంబర్ 24న జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని.. ఈ నేపథ్యంలో జిల్లాలోని వినియోగదారుల స్వచ్ఛంద సంస్థలు, వినియోగదారుల క్లబ్‌లు వినియోగదారుల హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వివరాలను డిసెంబర్ 8వ తేదీలోగా జాయింట్ కలెక్టర్‌కు అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీడియో, ఫొటోలతో పాటు సమగ్ర నివేదికను పంపిన ఎడల వాటిలో ఉత్తమమైన మూడింటిని ఎంపిక చేసి జాతీయ వినియోగదారుల దినోత్సవం రాష్ట్రస్థాయి వేడుకల్లో సత్కరించడం జరుగుతుందన్నారు. పౌర సరఫరాల కమిషనర్ మార్గదర్శకాలకు అనుగుణంగా వినియోగదారుల రక్షణ చట్టం-2019పై ప్రత్యేకంగా దృష్టిసారించి రూపొందించిన వినూత్న కార్యాచరణ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. షార్ట్‌ఫిల్మ్, ర్యాలీ, స్కిట్‌లు, ఇంటింటి ప్రచారం, ప్రదర్శనలు, ఎక్స్‌పో వంటివి నిర్వహించవచ్చన్నారు. వినియోగదారుల స్వచ్ఛంద సంస్థలు సొంతంగా లేదా వినియోగదారుల క్లబ్‌ల విద్యార్థులతో కార్యక్రమాలు నిర్వహించవచ్చని.. అయితే ఎంఈవో, స్కూల్ హెడ్‌మాస్టర్ నుంచి అనుమతి పొందాలని జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ అన్నారు.



### కలెక్టరేట్ సుందరీకరణ పనులు వచ్చేవారం నాటికి

# నూటికి నూరు శాతం పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు**

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** కలెక్టరేట్ ఆవరణలో జరుగుతున్న సుందరీకరణ పనులు మరింత వేగవంతం కావాలని, ఇప్పటివరకు 25 శాతం మాత్రమే బ్యూటిఫికేషన్ పనులు జరిగాయని వచ్చేవారం నూటికి నూరు శాతం పూర్తి చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఆయన ఛాంబర్ లో వివిధ శాఖల అధికారులు, ప్రణాళిక ఆర్కిటెక్చర్ బృందంతో సమావేశమై కలెక్టరేట్, కలెక్టర్ బంగ్లా, మంగినపూడి బీచ్ ల అభివృద్ధిపై విస్తృతంగా సమీక్షించారు. తొలుత జిల్లా కలెక్టరేట్, కలెక్టర్ బంగ్లా తో పాటు మంగినపూడి బీచ్ లను సుందరంగా తీర్చిదిద్దేందుకు రూపొందించిన మాస్టర్ ప్లాన్ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్లోని ఈవిఎం గోడౌన్లు డిఆర్డిఏ కార్యాలయాల వద్ద స్లోప్ ఎలివేషన్ పనులు మందగించడంపై ఆరా తీశారు. మట్టితో మెరక చేయడానికి ఎంత సమయం పడుతుందని డ్వామా పిడి జీవి సూర్యనారాయణ కలెక్టర్ ప్రశ్నించారు. మరో రెండు వారాల వ్యవధిలో కలెక్టరేట్లో మెరక పనులు పూర్తవుతాయని ఆయన చెప్పారు. ఈవీఎం గోదామును ఒక క్లస్టర్ గా ఏర్పాటు చేసి మధ్యలో హై మాస్ట్ విద్యుత్ దీపాన్ని సైతం ఏర్పాటు చేయాలన్నారు. ఆ తర్వాత జంగిల్ క్లియరెన్స్, అప్రోచ్ రోడ్లు విషయమై అడిగారు. జంగిల్ క్లియరెన్స్ కాకుండా ఫిల్లింగ్ పనులు సాధ్యం కాదని, ఆలస్యానికి గల కారణాలను మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ చంద్రయ్యను కలెక్టర్ పి. రాజాబాబు ప్రశ్నించారు. అగ్నిమాపక శాఖ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుంచి కలెక్టరేట్ ప్రధాన ద్వారం వరకు రోడ్డు కిరువైపులా అడ్డంగా పెరిగి ఎండిపోయిన చెట్ల కొమ్మలను కత్తిరించాలని, హార్టికల్చర్ అధికారులతో సమన్వయం చేసుకొని వారు ఎరుపురంగుతో ఇంటూ గుర్తు సూచించిన మొక్కల కొమ్మలను మాత్రమే తొలగించాలన్నారు. సుందరీకరణ పనుల్లో గ్రీనరీకి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని దట్టమైన పచ్చదనంతో ఏ రకమైన మొక్కలను ఎక్కడ నాటాలి మొక్కల సైజులను హార్టికల్చర్ అధికారులతో చర్చించి త్వరలో ఆ పనులు మొదలు పెడతామని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ కు వచ్చే ముఖ్యమైన రహదారి పక్కన చక్కని పూల మొక్కలతో ప్లాంటేషన్ నిర్వహించాలని ప్రతి కార్యాలయానికి రోడ్డు ఇవ్వాలని, ప్రధానమైన రోడ్డుకిరువైపులా ఆర్డీవో కార్యాలయం వరకు ఎటువంటి పార్కింగ్, రోడ్డు పక్కన ఎటువంటి వాహనాలు నిలిపి ఉండరాదన్నారు. ఒకవైపున వాహనాల పార్కింగ్ సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ట్రెజరీ కార్యాలయం వద్ద ప్రహరీ గోడ లేని రెండు గేట్లను తొలగించాలన్నారు. కలెక్టరేట్ చుట్టూ కూడా ప్రకృతి రమణీయంగా ఉండేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. మంగినపూడి బీచ్ యావత్ కృష్ణా జిల్లా ప్రజలకు మాత్రమే కాక రాష్ట్రవ్యాప్తంగా, పొరుగు రాష్ట్రానికి దగ్గరగా ఉండే ఒక ముఖ్యమైన బీచ్ అని అన్నారు. పర్యాటక కేంద్రంగా ఈ బీచ్ ను ఎంతో అభివృద్ధిపరచాలని బీచ్ కు వెళ్లే ప్రధాన కూడలి వద్ద హైమాస్ట్ లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించానని ఆ విషయం ఏమైందని జిల్లా పర్యటక శాఖ జనరల్ మేనేజర్ జి. రామ్ లక్ష్మణ్ ను కలెక్టర్ అడిగారు మంగినపూడి బీచ్ సమీపంలో ఏపుగా పెరిగిన తుమ్మ చెట్లను తొలగించి పిచ్చి మొక్కలు మొలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు, ఫోకస్ విద్యుత్ దీపాలు, మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను హై మాస్ట్ విద్యుత్ దీపాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అక్కడికి వచ్చిన పర్యాటకుల కోసం భద్రత సిబ్బందిని, వారికోసం గదిని ఏర్పాటు చేయాలన్నారు. వచ్చేవారం తాను స్వయంగా కలెక్టరేట్ సుందరీకరణ పనులు పరిశీలిస్తానని పురోగతి లేని సంబంధిత శాఖల అధికారులపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ పి. రాజాబాబు హెచ్చరించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పెద్ది రోజా, మచిలీపట్నం ఆర్డిఓ ఎం. వాణి, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జివి సూర్యనారాయణ, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిణి రాధిక, ప్రణాళిక వాస్తు కళా విద్యాలయం, విజయవాడ సహాయ ఆచార్యులు డి శ్రీనివాస్, సిహెచ్ కార్తీక్, జి షణ్ముఖ ప్రియ, ప్రాజెక్ట్ మానిటరింగ్ పిడి కెవి రావు, జిల్లా పర్యాటకశాఖ మేనేజర్ జి.రామ్ లక్ష్మణ్, రహదారులు భవనాలు, పంచాయతీరాజ్ ఈఈలు శ్రీనివాస్, రమణరావు, ఉద్యాన అధికారి మానస తదితర అధికారులు పాల్గొన్నారు.

# నందిగామ టౌన్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన డీసీపీ





**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** వార్షిక తనిఖీలలో భాగంగా పోలీస్ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డ్స్ లను పరిశీలించి ఎస్.హెచ్.ఓ.లకు తగు సూచనలు అందించాలని ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా, ఆదేశాల మేరకు మంగళవారం రూరల్ డి.సి.పి. అజిత వేజెండ్ల నందిగామ సబ్ డివిజన్ పరిదిలోని నందిగామ టౌన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రూరల్ డి.సి.పి. అజిత వేజెండ్ల నందిగామ టౌన్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసి, పోలీస్ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, ఎఫ్ఐఆర్ ఇండెక్స్, వివిధ క్రైమ్ రికార్డ్స్ లను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, స్టేషన్ లో సీజ్ చేయబడిన వాహనాలను, లాకప్ గదులను, కంప్యూటర్ గదులను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు, సలహాలను ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రూరల్ డి.సి.పి. అజిత వేజెండ్ల అధికారులు, సిబ్బందితో మాట్లాడుతూ ..... స్టేషన్ ల పరిది లో పెండింగ్ కేసులను తగ్గించాలి అని, బీట్స్ పెంచి స్టేషన్ పరిధిలో జరిగే నేరాలపై దృష్టి సారించాలని, అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించి నిఘా పెంచి వాటి పై పూర్తిస్థాయి నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి యొక్క సమస్యలను చట్ట ప్రకారంగా పరిష్కరించాలని, స్పందన పిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని తెలియజేశారు. నిర్మానుష్య ప్రదేశాలు, పరిసర ప్రాంతాలలో తిరుగు అనుమానస్పద వ్యక్తులపై, గంజాయి విక్రయ, సేవించు వ్యక్తులపైన అదే విధంగా చెడునడత కలిగిన వ్యక్తుల కదలికలపై గట్టి నిఘా ఏర్పాటు చెయ్యాలని, గంజాయి అక్రమ రవాణాపై నిఘాతో కేసులు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేయడం జరిగిందని, ఇంకా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసి ఎక్కడా గంజాయి ఇతర మత్తుపదార్ధాల లేకుండా కట్టడి చేయాలని, ఎన్.టి.ఆర్ జిల్లా ని గంజాయి రహిత జిల్లా చేయాలని పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో నందిగామ సబ్ డివిజన్ ఏ.సి.పి జనార్ధన నాయుడు, నందిగామ టౌన్ ఇన్స్పెక్టర్ జె.ఆర్.కె.హనీష్ బాబు, ఎస్.ఐ. పండు దొర, నరేష్, రమణ, సిబ్బంది పాల్గొన్నారు





## తస్మాత్ జాగ్రత్త...

# తాగి వాహనాలు నడిపితే జైలుపాలే..



### నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై స్పెషల్ డ్రైవ్

**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా ఆదేశాల మేరకు నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించినారు. ట్రాఫిక్ పోలీసులు ప్రతి వారం నగరంలో పలుచోట్ల డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. దీనిలో బాగంగా విజయవాడ నగరంలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు 1326 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పెట్టినారు. ఈ కేసులలో 376 మందికి జైలు శిక్ష విధించడంతో బాటు, ఒకొక్కరికి 10 వేల రూపాయల చొప్పున జరిమానా విధించినారు. ఈ సవత్సరం ఇప్పటి వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలోని ముద్దాయిలకు న్యాయస్థానాలు ఒక కోటి పద్నాలుగు లక్షల ఎనిమిది వేల రూపాయలను జరిమానాగా విధించాయి. డ్రంక్ అండ్ డ్రైవ్ కు పాల్పడే వారి డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేయడానికి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా తెలిపారు. నగరంలో వివిధ ప్రదేశాలలో తరచుగా మద్యం సేవించి వాహనములు నడిపే వారి కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఇక మీదట ట్రాఫిక్ పోలీసుల తో బాటు లా అండ్ ఆర్డర్ పోలీసులు కూడా "డ్రంక్ అండ్ డ్రైవ్" పై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని పోలీస్ కమీషనర్ ఆదేశించినారు.







### నారా లోకేష్‌ను కలిసిన బూరగడ్డ

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ని మాజీ డిప్యూటీ స్పీకర్ టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పెడన నియోజవర్గం మాజీ ఎమ్మెల్యే బూరగడ్డ వేదవ్యాస్ బూరగడ్డ కిషన్ తేజ్ మంగళవారం హైదరాబాదులో కలిశారు. టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు కి బెయిల్ వచ్చిన సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకొన్నారు. అలాగే జిల్లా వారీగా నియోజకవర్గ వారీగా తాజాగా జరిగిన పరిణామాలు గురించి విపులంగా నారా లోకేష్ తో చర్చించారు.

### శైవ పుణ్య క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** కార్తీక మాసం సందర్భంగా ఏపీఎస్ఆర్టీసీ కృష్ణాజిల్లా వారు అవనిగడ్డ, మచిలీపట్నం, గుడివాడ, గన్నవరం మరియు ఉయ్యూరు డిపోల నుండి కార్తీక మాసంలో ప్రతి ఆదివారం రాత్రి పవిత్ర శైవ క్షేత్రాలైన పంచారామాలకు, కార్తీక పౌర్ణమి ముందు రోజున అనగా 25-11-2023 తేదీన అరుణాచలం నుండి కంచి వరకు ప్రత్యేక సర్వీసులు, ప్రయాణీకుల రద్దీని బట్టి వారు కోరిన విధంగా యాగంటి, మహా నంది మరియు శ్రీశైలం పుణ్య క్షేత్రాలను ఒకేసారి దర్శించేలా త్రిలింగ దర్శని, అంతే కాకుండా మచిలీపట్నం, అవనిగడ్డ, గుడివాడ డిపోల నుంచి కార్తీక మాసంలో ప్రతి రోజు అదనంగా శ్రీశైలంకు ప్రత్యేక సర్వీసును ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ. వాణీశ్రీ ఒక ప్రకటనలో తెలియజేశారు. పైన పేర్కొన్న సర్వీస్ ల యందు టికెట్లు బుక్ చేయదలచిన వారు క్రింద సూచించిన ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు మరియు ముందస్తుగా ఆన్ లైన్ లో కూడా రిజర్వేషన్ చేసుకునే సౌకర్యం కలదు. గ్రూపుగా వెళ్లే ప్రయాణీకులకు సంబంధిత డిపో మేనేజర్ లను సంప్రదిస్తే తమ ఊరి వద్దకే బస్సును పంపబడును. కావున ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆర్టీసీని ఆదరించవలసిందిగా కోరుచున్నాము అని తెలియజేశారు.

## ప్రతి ఒక్క సంఘ మహిళలకు అండగా మెప్మా బజారు



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** మచిలీపట్నం నగరపాలక సంస్థలో మెప్మా ద్వారా ఆసరా, చేయూత, తోడు, పీఎం స్వానిధి, బ్యాంకు లింకేజీ ద్వారా పొందిన సొమ్ముతో స్వయం సహాయక సంఘ సభ్యులు వారి యొక్క జీవనోపాదులు మెరుగుపరుచుకొనుటకు తయారు చేసుకున్నటువంటి ఉత్పత్తులను అమ్ముకొనుటకు మచిలీపట్నం నగరపాలక సంస్థ- మెప్మా వారి ద్వారా ప్రతినెల 2 రోజులు మార్కెటింగ్, డిస్ప్లే చేయుటలో భాగంగా మంగళవారం నగరపాలక సంస్థ ఆవరణ యందు బజారు ఏర్పాటు చేశారు. ఈ మెప్మా బజారును మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా వివిధ పథకాల ద్వారా లబ్ది పొందిన సంఘములు వారి యొక్క సొమ్మును వృద్ధి చేసుకుంటానికి ప్రతి ఒక్క సంఘ సభ్యులు జీవనోపాధులు ఏర్పాటు చేసుకోవాలని వారి ఆర్థిక స్థితి గతులను మెరుగుపరచుకోవాలని ప్రభుత్వం ప్రతి ఒక్క సంఘ మహిళలకు అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, మెప్మా సిబ్బంది, స్లమ్ సమైక్య ఆర్పీలు పాల్గొన్నారు.

# మహిళల ఆరోగ్యమే సమాజానికి బలం

## కుటుంబ విలువలను కాపాడేది మహిళలే...

## ఆరోగ్యవంతమైన సమాజం.. హిళలతోనే సాధ్యం...

### జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీ రావు





**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** కుటుంబ వ్యవస్థలో మహిళల పాత్ర అనిర్వచనమని కుటుంబ అభివృద్ధి కోసం అహర్నిసలు శ్రమించే మహిళలు పరిపూర్ణమైన ఆరోగ్యవతంగా జీవించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. సీతానగరంలోని విజయ కీలాద్రి దేవస్థానం ఆశ్రమంలో చిన్న జీయర్ స్వామి ట్రస్ట్ సారధ్యంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన "మహిళా ఆరోగ్య వికాస్" కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ అభివృద్ధి కోసం మహిళలు తమ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ఎంతో శ్రమించి బరువు బాధ్యతలను మోస్తున్నారన్నారు. ప్రధానంగా మధ్యతరగతి కుటుంబాలలో ఉండే ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా వ్యక్తిగత ఆరోగ్యాన్ని సైతం పట్టించుకోలేని పరిస్థితిలో ఉంటారన్నారు. అనారోగ్యంతో బాదపడుతున్నప్పటికి కనీసం ఆ భాదను కుటుంబ సభ్యులతో పంచుకోవడానికి కూడా సంశయిస్తారన్నారు. ఈ పరిస్థితులలో మహిళాలకు వైద్యపరమైన సహాయం అందించేందుకు చిన్న జీయర్ ట్రస్ట్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. మహిళలు ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడు సంతానంపై దృష్టి పెట్టి గుణాత్మకమైన విద్యా బుద్ధులు నేర్పించి ప్రయోజకులుగా తీర్చిదిద్దడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజానికి దోహదపడతారన్నారు. ముఖ్యంగా ఇటీవల మారుతున్న కాలాన్ని బట్టి పనిఒత్తిడికి లోనై మహిళలు వివిధ రుగ్మతులకు గురి అవుతున్నారన్నారు. ఎన్ని ఒత్తిళ్లు ఉన్నప్పటికీ మహిళామణులు తమ కుటుంబ అవసరాలు తీర్చేందుకు వెలకట్టలేని సేవలందిస్తున్నారన్నారు. వీరి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవడం సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఇటువంటి ఒక గొప్ప కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఎంతో సంతోష్యాన్ని ఇచ్చిందన్నారు. ఏ దేశంలోనైనా మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని చిన్న జీయర్ స్వామి సంకల్పించిన మహత్తర కార్యక్రమం ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాలలో రెండు లక్షల మందికి పైగా మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అనారోగ్యంగా ఉన్నవారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడంలో అద్వితీయమన్నారు. ప్రస్తుతం ఈ రోజు నిర్వహించిన వైద్య పరీక్షల ద్వారా 500 మందికి పైగా మహిళలకు గర్భాశయం, హృదయ, శ్వాస, చెవి, నేత్ర, దంత కాలేయం, గ్యాస్టిక్ ట్రబుల్, వెన్నునొప్పి వంటి అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారికి ప్రసిద్ధి పొందిన కార్పొరేట్ ఆసుపత్రుల చెందిన వైద్యుల బృందం వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ డిల్లీరావు అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త గోకరాజు గంగరాజు, విజయవాడ నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా, డిప్యూటీ కమిషనర్ రవీంద్ర నాథ్, కార్యక్రమ సమన్వయకర్త మాధవి రవీంద్ర, ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్య స్వామి, రఘునాధ స్వామి, విఠల్ బాబు, విశాఖపట్నం, విజయనగరం మహిళా ఆరోగ్య వికాస బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

# త్వరలో పేటముత్యాలమ్మ ఆలయ నిర్మాణం



**నందిగామ నవంబర్ 21 మేజర్‌న్యూస్ :** శ్రీరామలింగేశ్వర స్వామి వారికి చెందిన రంధం నిర్మాణం కొరకు టెండర్లను పిలవటం జరిగింది. గుత్తేదారులు రాగానే రథం నిర్మాణం చేపట్టటం జరుగుతుందని ఉమ్మడి కృష్ణజిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమీషనర్ కె శాంతి తెలిపారు. మంగళవారం నాడు మండల పరిధిలోని శ్రీసత్యమ్మ తల్లిని దర్శించుకున్న ఎండోమెంట్ అధికారిణి మా మేజర్‌న్యూస్‌తో మాట్లాడుతు నందిగామ పట్టణంలోని పేటముత్యాలమ్మ అమ్మవారి ఆలయనిర్మాణం కొరకు అదే విధంగా దేవాలయానికి చెందిన ఆక్రమణలో ఉన్న భూమిని పరిశీలించేటం జరిగిందని ఆమె తెలిపారు. పేటముత్యాలమ్మ ఆలయ నిర్మాణం కొరకు దాతలు సిద్ధంగా ఉన్నారన్నారు. సదరు ఆలయ ట్రస్టీగా మేమున్నామని కొందరు సంప్రదించటం జరిగిందని తెలిపారు. పూర్తి విచారణ జరిపి ఎండోమెంట్ ట్రిబ్యునల్‌కు త్వరలోనే అందచేస్తామని ఆమె పేర్కొన్నారు. కొన్ని ఆలయాలకు చెందిన భూములు ఆక్రమణలో ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందని, వాటిపై పూర్తి నివేదికను ట్రిబ్యునల్ పంపించటం జరిగిందని, ట్రిబ్యునల్ ఆదేశాలు వచ్చాక నందిగామ కోనేరుకు చెందిన ఆక్రమణలపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఎండోమెంట్ అసిస్టెంట్ కమీషనర్ కే శాంతి స్పష్టం చేసారు. ఈ పర్యటనలో డివిజన్ ఇన్‌స్పెక్టర్ పి ఫణికుమార్, డివిజన్ పరిధిలోని ఆలయ కార్యదర్శులు భూపతి, సురేష్, సూపర్నిడెంట్ బొగ్గవరపు రవీంద్ర తదితర ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఇది రహదారి

# పేరుకే రహదారి సైకిల్ కూడా వెళ్ళదు

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** పేరుకే రహదారి కానీ కనీసం సైకిల్ కూడా వెళ్ళడం కష్టమే. 5వ వార్డులోని అంతర్భత రహదారి పరిస్థితి చూస్తే అందరూ ఆశ్చర్యపోవడంతో అతిశయోక్తి లేదు. అవనిగడ్డ, నాగాయలంక ప్రధాన రహదారి నుండి సంతమార్కెట్ రహదారిని కలిపే సుమారు 200 మీటర్ల రహదారి పేరుకే రహదారి కానీ పంచాయితీ అధికారులు ఆ రహదారిని గత 30 సంవత్సరాలుగా అభివృద్ధి చేసిన దాఖలాలు మచ్చుకైనా కనిపించవు. ఆ కారణంగా రహదారి ఎత్తు పల్లాలతో చిట్ట అడవిలా మొక్కలు పెరిగి దర్శనం ఇస్తూ ఉంటుంది. ఈ రహదారి వెంబడి పక్కా భవనాలు నిర్మాణం జరిగిన రహదారి నిర్మాణంపై ఆ యా గృహాల యజమానులు సైతం శ్రద్ధపెట్టిన దాఖలాలు లేవు. ఈ కారణంలో కేవలం కాలిబాట రహదారిగానే మిగిలిపోయింది. ఈ నేపథ్యంలో రహదారి వెంబడి భవనాల యజమానులు రహదారిని భవనాల నుండి వస్తున్న చెత్త పడేస్తూ ఉండటంతో మరింత అసౌకర్యంగా రూపొందింది. భూగర్భ డ్రైనేజీ కోసం కూడా రహదారి వెంబడి నిర్మించాలని ఇప్పటికే నిరుపయోగంగా కనపడుతూ ఉంటాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించడం ద్వారా పక్కా రహదారి ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# సీజీహెచ్‌ఎస్ పరిధిలోకి మంగళగిరి ఎయిమ్



## ఉత్తర్వులు జారీ చేసిన హైదరాబాద్ ఏడీ కార్యాలయం

**విజయవాడ, మేజర్ న్యూస్ :** మంగళగిరిలోని ఎయిమ్ ని కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్‌ఎస్) లోకి తీసుకువస్తూ... హైదరాబాద్ లోకి అడిషనల్ డైరెక్టర్ కార్యాలయం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసిందని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు ఎయిమ్స్, సీజీహెచ్‌ఎస్ మధ్య ఒప్పందం కూడా జరిగిందని ఎక్సైజ్ పెన్షనర్ల సంఘ నేతలు టి. వివేకానంద, గద్దె తిలక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు వివరిస్తూ ఇన్ స్పెక్షన్ నిమిత్తం ఇటీవల విజయవాడ వచ్చిన సీజీహెచ్‌ఎస్ అడిషనల్ డైరెక్టర్ జి. లక్ష్మయ్యకు తమ సంఘం చేసిన విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకొని మంగళగిరి ఎయిమ్స్ కు సీజీహెచ్‌ఎస్ ఎమ్ పానెల్డ్ హాస్పటల్‌గా ప్రకటించడం హర్షదాయకమన్నారు. దీని కారణంగా సీజీహెచ్‌ఎస్ కార్డు ఉన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు, స్వాతంత్ర సమర యోధులు, మాజీ పార్లమెంట్ సభ్యులకు, సీజీహెచ్‌ఎస్ స్టాఫ్ కు లబ్ది చేకూరనున్నదని తెలిపారు. కార్డు ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని ఏ ప్రాంతానికి చెందిన వారైన ఎయిమ్స్ సేవలు వినియోగించుకోవచ్చునన్నారు. వర్కింగ్ ఎంప్లాయిస్‌కు రీఎంబర్స్ మెంట్ సౌకర్యం, పెన్షనర్లకు ఉచిత సేవలు ఎయిమ్స్ లో లభిస్తాయన్నారు. కార్డు హోల్డర్కు అందుబాటులో ఉండే విధంగా చిన్న సబ్ సీజీహెచ్‌ఎస్ వెల్ నెస్ సెంటర్ను ఎయిమ్స్ లోనే ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేసారు. అక్కడే సీజీహెచ్‌ఎస్ రిఫరల్ లెటర్ తీసుకొని, అక్కడే వైద్య సదుపాయాలు పొందటం సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేకంగా సీజీహెచ్‌ఎస్ అడిషనల్ డైరెక్టర్ కార్యాలయం అవసరమని, ఆ కార్యాలయాన్ని విశాఖపట్నంలో కాకుండా విజయవాడ లేదా మంగళగిరి ల వద్ద నెలకొల్పాలని కోరుతూ కేంద్ర ఆరోగ్య కార్యదర్శికి లేఖ రాయనున్నట్లు గద్దెతిలక్, వివేకానంద తెలిపారు.


17వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999